# కథలు చెప్పే గౌరి

గౌరి పెళ్ళికి మామగారు రాలేదని చెప్పుకోవడం ఒకటే గుర్తుంది. చీకటితో లేపి బామ్మ తలదువ్వటం, వీరన్న కట్టిన జట్కాబండిలో స్టేషన్‌కి వెళ్ళడం, మొదటిసారి రైలుబండిలో కూర్చుని ఊరుకేసి చూడటం అన్నీ ఇప్పుడు జరిగినంత విశదంగా చెప్పగలదు. కాని పెళ్ళిమాట అడిగితే, ఎంత గింజుకున్నా గుర్తుకి రావటం లేదు అని అడిగినవాళ్ళందరికి, ఎదిగిన గౌరి విరామం లేకుండా జరిగిన కాలంలో చెప్పేది, చెప్తూ వుంటుంది కూడా.

అత్తగారిది, ఆదినుంచి అదో తరహాట. ఆవిడకే అత్తారింటికి రావటమే ఇష్టంవుండేది కాదని చెప్పిందంటూ బామ్మ ఎప్పుడైనా గొల్లగంగమ్మకి చెపుతున్నాడు తనూ వినేది గౌరి.

అమ్మకి ఎప్పుడైనా కోపం వచ్చేది. ఆ కోపంలో బామ్మని పెద్దకంఠముపెట్టి మాటలాడేది. నా పండులాంటి గౌరిని మీ మూలాన్నే ఆ కిరాతకులకొంపలో పడేశాము. తల్లి ఆ తీరు, కొడుకెల్లావున్నాడో అని వుసూరుమని కోపంపోయేదాకా గదిలో మంచంమీద పడుకొని ఏడ్చేది బామ్మ ఎర్రటి మొహం మరీ ఎర్రబడేది. తులసికోట అరుగుమీద కూర్చుని వత్తులు చేసుకుంటూ కళ్ళు వత్తుకునేది.

గౌరికి అర్థంకాక ఇటూ అటూ తిరుగుతూ బామ్మ ఏమైనా చెపుతుందేమోనని కళ్ళప్పగించి చూసేది. అలా ఎన్నోసార్లు జరిగాక గౌరిని పెద్దవాళ్ళలో చెప్పినరోజు, ఏమిటి పిచ్చిదానా! అంటూ ఏడుపుమొహంతో నవ్వే బామ్మకేసి చూసేందుకు భయపడి గౌరి వాకిట్లోకి పరుగెట్టింది,

సందెవాకిలి వూడ్చే అప్పి కొంప మునిగినట్టు 'అక్కడే నిలవండి అమ్మాయిగోరు'

అంటూ హడలగొట్టేసింది గౌరిని.

ఇంటిలోవాళ్ళని పెద్దగొంతుపెట్టి పిల్చింది అప్పి.

అమ్మరావటం, మాట్లాడకుండా కళ్ళనీళ్ళెట్టుకొవడం బామ్మ కోప్పడ్డం, పక్కింటి బామ్మగారు హడావిడిపడటం దీపాలు వెలిగించడం, పంచాంగాలు తెప్పించటం, ఆ సాయంత్రం అప్పుడే తెల్లారినంత సందడిగా వుంది. చుట్టుపక్కల ఇళ్ళల్లో వాళ్ళు ఒకరొకరే తొంగిచూసి, అప్పినీ, అమ్మనీ అడిగి, ఏదోరహస్యాలు మాట్లాడివెళ్ళటం అన్నా ఏమిటో ఖంగారు పెడుతున్నాయి గౌరిమనస్సుని.

ఆ రోజు గౌరికి దుఃఖం రాకపోయినా మరుసటిరోజు వచ్చే చుట్టాలిని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకోవడం చూసి తల్లి కోప్పడింది.

సందడిగా జరిగిపోయాయి. చుట్టాలు వుండగానే, అత్తగారుకూడా నలుగుర్ని వెంటబెట్టుకు బస్సుదిగింది అంటూ గుసగుసలాడారు.

భోజనాలదగ్గర ఇప్పుడేం తొందరలెండి అన్న బామ్మమాటమీద అత్తగారికి కోపంవచ్చి, వాళ్ళని తీసుకు వీధిలోకి వెళ్ళి బస్సు ఆపమని హడలగొట్టేసింది.

వియ్యపురాలిని బతిమాలుకుని క్షమార్పణ చెప్పి తనదే తప్పు అంటూ సూర్యనారాయణగారు లోపలికి పిల్చుకొచ్చారు.

ఆరోజు అంతా పాములా బుసకొడుతూనే కాంతమ్మ గారు గడిపింది.

వెళ్ళిన పెద్ద కాంతమ్మగారి కొడుకుని వెంటబెట్టుకుని తెల్లాకేసరికి బండిదిగాడు.

బామ్మ, అమ్మ, పక్కింటి బామ్మగారు చాలాసార్లు సందులో కలుసుకు మాట్లాడుకుంటూనే ఇంటిపనులు పూర్తి చేసుకున్నారు. మధ్యాహ్నంవేళ మిఠాయికొట్టు రామన్న పంచదార చిలుకలు రంగురంగులవి పెద్దబుట్టెడు పట్టించుకు వచ్చాడు.

పెరట్లో అమ్మకి, అత్తగార్కి పెద్ద ఘర్షణ మొదలైంది. నాన్న అమ్మని కోప్పడి అత్తగార్కి ఊరటకల్గించాడు. ఐనా అత్తగారు వూరుకోకుండా మాట్లాడుతూనే వుంది. "ఆఖరి సవాలు, మావాడు నా మాట అక్షరాలా జరుపుతాడు. ఇప్పుడు కావాలంటే మీ పిల్లని కన్నెత్తిచూడద్దంటే చూడకుండా నావెంట వచ్చేస్తాడు. ఏమనుకుంటున్నావో" అని అమ్మపైన ఏకవచనం ప్రయోగించటం విని చిన్నత్త ఉక్కురోషపడి; మాటలు వదిలేసింది. అందులో అత్తగార్కి ఎక్కువ కోపం తెచ్చిన మాట - " అంత ఆడంగివాడు కనుకే నీ ఆటలు సాగుతున్నాయి " అంది

ఆకోపం తారామండలాన్ని అందుకుంది. ఆ రాత్రి వెళ్ళేందుకు బస్సులేదు కనుక సత్రపుటరుగుమీదికి మకాం మార్చారు అత్తగారు, పరివారం.

ఎంత అభాసు అంటూ బామ్మ ముక్కుమీద వేలువేసుకుంది. చాలా పొద్దుపోయాక అత్తగారు కొడుకుని పిల్చుకువచ్చి తలుపుకొట్టి "మీ అంత బుద్ధిలేనిదాన్ని కాదు నేను" అంటూ విస్తర్లేయించి తిరిగి సత్రానికి వెడుతూ "చీకటితోటే ఆ పిల్లని తీసుకు అక్కడికి రా. తెల్సిందా!' ' అంటూ మేఘాల్లేని వురుములా మోగి, గజ్జెలగుఱ్ఱంలా రోడ్డుయెక్కి వెళ్ళటం చూసి ఇంటిలో వాళ్ళు కళ్ళతోటే మాట్లాడుకున్నారు ఆశ్చర్యంగా.

గౌరిమనస్సు తల్లి మాటకి ఎదురుతిరిగింది. ఆగది వదిలి పక్కగదిలోకి వెళ్ళనని మొరాయించింది. ఎన్నో ఆగడాలతో ఆ రోజు అంతా విసిగివున్న తల్లి వోర్పుమరచి, గౌరి జబ్బపట్టుకు విసుగ్గా పిల్చుకొచ్చి పక్కింటి బామ్మగారికి అప్పగించింది.

బామ్మగారు లాలించి తులసి కోటదగ్గర వుపదేశంలా " అతన్ని నీవాడిలా చేసుకునే నేర్పు నీకుండాలి, తెలిసిందా! వాళ్ళు వాళ్ళు ఎల్లాగైనా అనుకోని, ఏం తెలిసింది? అబ్బాయిని

ఎదిరించకుడదు సుమా! అంటూ ఎన్నో బోధలు చేసి, పెరటిలోంచి గదిలోకి తీసుకొళ్ళి "వుండుమరి" అంటూ వెళ్ళి పోయారు.

భయాన్ని మరచి చీకటిలో గోడవారగా నిల్చుని నక్షత్రాలకేసి చూస్తోంది. గదిలో కదిలిన చప్పుడు సందులో మనిషి కదిలిన అలికిడికి గౌరి భయంతో తలవంచుకుంది. తన చేతిని పట్టుకున్న చేతిని విదిలించాలనిపించింది గౌరి మనస్సుకి. మళ్ళా పక్కింటి బామ్మగారి మాటలు మనసులో కదిలాయి. మౌనం మనస్సుని దాచింది. సందులో చీకటిగదిలోకి జరిగింది. గదిలోనిదీపం నిద్దరోయినట్టయింది. దూరంగా గుసగుసలు, నవ్వులు, బామ్మ అదిలింపులు - అది కీచురాళ్ళ అరుపులా వినపడి దూరంగా జరిగినట్టుంది. చీకటిలో ఎలుకలు పంచదార చిలకల్ని దొర్లించాయి.

భయంతో గుండెలు వేగంగా కదులుతున్నాయి. కిటికీలోంచి నక్షత్రాలు తొంగిచూసి సిగ్గుతో చిన్నకాంతిని విసిరి, కళ్ళు మూసినట్లు కదులుతున్నాయి. చిరువెల్తుర్లో అత్తగారి ఆదేశం, ఆకారం అతనిలో చూసి చీకటిలో వున్నంత భయంగా గౌరి మనస్సు మూలిగి ముడుచుకుంది.

మగతనిద్రలో అత్తగారి కంఠము జేగంటలా మ్రోగింది. గౌరి పెరటిలోంచి మండువాలోకి వెళ్ళింది. అమ్మా, బామ్మా కనుచీకటిలో దిగులుగా కూర్చున్నట్టువున్నారు.

నాన్న లోపలినించే, "దాని ప్రయాణానికి అన్నీ సిద్ధం చెయ్యండి. ఆవిడ ఎల్లాగా వూరుకోదు", అంటూ వీధివేపు వెళ్ళిపోయాడు.

అంతా బస్సుదగ్గరకి చేరారు. తను ఎక్కిన బస్సుని క్షేమంగా వెళ్ళమని సాగనంపారు.

మూలుగుతూ కుదిపి కదిలింది బస్సు. వూరువిడిచి తుప్పల్లోంచి దారిచేసుకు వెడుతోంది. పొద్దు ఎక్కుతోంది. చిన్న చిన్న పల్లెల్లో జనం పల్చపల్చగా ఎక్కుతూ దిగుతున్నారు. ఎండవేడి అత్తగారికళ్ళల్లో కదులుతోంది. 'ఏమిటాచూపు ఇటుతిరిగి కూర్చో' అన్న అదిలింపులతో గౌరి కుదించుకు, తలవంచి కూర్చోక తప్పలేదు.

పక్కసీటులో కూర్చున్న కుర్రాళ్ళు సన్నగా నవ్వుకోవడం చూసిన అత్తగారు వుపన్యాసం మొదలుపెట్టింది. 'వెధవ సినిమాలు తెస్తున్నాయి ఇన్ని అనర్థాలు. లేకపోతే ఇల్లానవ్వేందుకు ఎవడికైనా ఇంత ధైర్యం వుండేదా అంట? పూర్వం.'

ఎవరూ మాట్లాడకపోవట, చూసి కొడుకుమీద సవాలుచేస్తూ, ఎఱ్ఱిగా బుఱ్ఱిగా వుంది గదా అని దాన్ని వేసుకువచ్చిన సినిమాలకల్లా ఎగబడేవు జాగ్రత్త! అదేమొ వట్టిపల్లెటూరిదాయె. తెలిసిందా? అంటూ కళ్ళతోటి చుట్టుపక్కట వాళ్ళకి కూడా. దడపుట్టేటట్టు వురమటం చూసి గౌరిమనస్సు మళ్ళా దడుసుకుంది. మరో పల్లెటూరిలో ఎక్కిన ముసలాయన 'ఏం కాంతమ్మా ! ఎక్కడనుంచి రాక? ఆశ్రమంలోనేనా వుంటం?' అంటూ ప్రశ్నలు వేస్తున్నాడు.

'నా ప్రయాణానికేం గాని ఏమైనా చందాలు పోగుచేశారా? ఇంకాట్టేవ్యవధిలేదు. వచ్చేనెలలోనేగా పాదపూజ! ఈ బంధాలు తెంచుకుందామన్నా వదలం లేదు. మనసుకి అన్నీ చికాకులే. వీడి తండ్రి అన్నీ చూసుకుంటూ నా కెందుకు ఈ తాపత్రయం చెప్పండి !'

"ఎవరిమాట? పున్నయ్యనే అంటున్నావూ...!" అంటూ ముసలాయన పక్కకి తిరిగి నవ్వుకోడం గౌరి కళ్ళపడింది.

"ఆ చూపులే వద్దు అంటూంట. పెద్దాచిన్నా లేకుండా ఏమిటా మిడిగుడ్లచూపు' అంటూ గౌరితల పట్టుకువంచింది. గౌరికి మెడవిరిగినంత బాధపెట్టినా పైకి మూలగలేదు

భరించింది.

"ఈ అమ్మాయి ఎవరు?" అంటూ మళ్ళా ముసలాయన ప్రశ్న.

"ఇంకెవరూ ! మా కోడలి సౌడిభ్యం" అని మెటికలు అన్నీ ఒక్కసారి వెనక్కి విరిచింది.

ఇంతలో బస్సు ఆగటం - అత్తగారు ఉరకటం - సామాన్లు దింపటం - తను చీరతొక్కుకు పడబోవటం - ఎదరసీటులో ముసలావిడ జాగ్రత్తని చెయ్యియివ్వటం - కండక్టరుకు తగిలావంటూ అత్తగారు అరవటం - ముందుసీటులో ముసలాయన "ఏం పున్నయ్యా! మీ ఆవిడ నీమీద పెద్ద ఫిర్యాదు చేసిందిలే" అంటూండగా బస్సుకదిలి దుమ్ము మొహానకొడుతూ వెళ్ళిపోయింది.

వూరికి ఎక్కడా కళాకాంతి కనపడలా, ఏదో దిగులుగా వుంది. మధ్యాహ్నపువేళే ఇలావుంటే పొద్దు తిరిగితే ఇంకా బిక్కుబిక్కుమంటూ వుంటుందేమో, అనుకుంటూ దిక్కులు చూస్తున్న గౌరిని మళ్ళా అత్తగారు అధిలించింది.

రోడ్డుమీద ఎందుకులే నీ ప్రతాపం అన్న మామగారి మీద విరుచుకుపడింది అత్తగారు.

రోడ్డుప్రక్క మొదటిసందులోకి తప్పుకొన్న మామగార్ని మళ్ళా చూడలేదు గౌరి.

ఇల్లు మండువా యిల్లే. గోడల్లోంచి మట్టి తొంగి చూస్తోంది. మండువాలో కిలుంపట్టిన చిల్లు బిందెలో కొద్దిగా నీళ్ల వున్నాయి. పక్కనే నిలువలేక దొర్లివున్న ఛొట్టలచెంబు మట్టిముద్దలా పడివుంది.

పెణకని పట్టుకు వుయ్యాల వూగుతోంది బూజు. నవ్వారుమంచాలు మురికితో మూలకివున్నాయి. సగం వూడిన వూకబస్తా నిండుగా కనబడుతోంది. మకిలిపట్టిన పటాలు గోడకు వంకరతిరిగి చూస్తున్నాయి.

అంతసేపు ధైర్యంగా చూసినందుకు గౌరికి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. అత్తగారి కంఠము ఘల్లుమంది. ఆవిడ వెనకవచ్చే అర్భకురాలిని చూశాక గౌరిగుండె కుదుట పడింది. ఆయింట్లో దిగులు లేకుండా కనబడిన వస్తువు అర్భకురాలే అనిపించింది. ఎంతో స్వచ్ఛంగా వుంది ఆ చూపు. నవ్వాలని వున్నా పరిసరాలకు భయపడాలన్నట్టు మూతిముడుచుకు చూస్తోంది.

అత్తగారు మధ్యలో చతికిలపడి ఒంట్రింపులా మొదలు పెట్టింది. నెమ్మదిగా పక్కకి వరిగింది. "అబ్బా, సాంబం! మీ అమ్మకి పూనకం వచ్చినట్లువుంది" అని ఏ భావం లేకుండా చూస్తూ అర్భకురాలు అని వూరుకుంది.

తల్లిని చుట్టుకు అది సవరించి, ఇది సవరించి, "ఏం కావాలి స్వామీ? ఎవరూ?" అంటూ చెవిదగ్గర పెద్దరొదచేస్తూ, " అల్లా మొద్దులా నిల్చోకపోతే కాస్త కాళ్ళు చేతులు సవరించరాదూ" అంటూ గౌరిని కసిరాడు సాంబము.

గౌరికి చెయ్యాలని లేకపోయినా తప్పని సరిగా వెళ్ళి కాళ్లు సవరించబోయింది.

కాళ్ళు చేతులు నేలకేసి కొడుతూ కళ్ళు తెరచి, "ఒరేయ్ పున్నయ్యా! రారా! కాళ్ళమీద పడకపోయావో నిన్నూ, నీ కొడుకునీ అంతం చేస్తాను. ఏం?' అంటూ లేచి వూడిన జుట్టు విదిలిస్తూ గుడ్లువురిమి పక్కకి చూసి, "నేను ఎవరనుకున్నావు ? మీ ఇలవేల్పుని మర్చావుటరా" అంటూ మళ్లీ కూలబడి గోడకేసి తలకొట్టుకొని "ఒరేయ్! పెళ్ళాన్ని చూసి నీ తల్లిని మర్చేవు జాగ్రత్త? నీ తల్లి అంటూ ఎవరను కున్నావు ? సాక్షాత్తు దుర్గరా! తెలిసిందా?' ' అంటూ నాలిక మడచి కళ్ళు గుండ్రంగా తిప్పిన మొహం చూసి గౌరి భయంతో వెర్రికేక పెట్టి

వణికిపోయింది.

అంతసేపు తనకేం పట్టనట్టు వూరుకున్నావిడ గౌరివీపు మీద తట్టి లోపలికి తీసు కెళ్ళింది.

'ఏమేవ్ సీతా! దాన్ని ముట్టుకోకు. దానిక్కూడా ఆవహించని దేవతల్ని. అంటూ పరుగెట్టింది కనకమ్మ.

కొడుకు ధూపం పుచ్చుకు ఎదురు రావటం చూసి నివారాలో కూలబడి ఒంట్రింపులోకి దిగి మెల్లిగా తేరుకున్నట్టు కళ్ళు తెరచి, కొడుకుని దగ్గరకి తీసుకుని తలనిమిరి, "ఆదేదిరా అబ్బీ?" అంటూ ఆప్యాయత ఒలకబోయటం తలుపు సందునించి గౌరి చూస్తోంది.

అటూ ఇటూ చూసి 'ఆ సీతిముండ దీనికి అన్నీ నూరి పోస్తుందేమో! ఓకంట చూసుకుంటూ ఉండు. తెల్సిందా? ఎందుకో నీ పెళ్ళాంలో నాకు నచ్చిన గుణాలు కనబడటం లేదు. చెప్పొద్దూ! నిన్నేం చేస్తుందో' అంటూ ముక్కు తుడుచుకుంటూ మొల్లోంచి చామంతి పువ్వుతీసి కొడుకు చేతిలో పెడుతూంటే ఆవిడ వచ్చింది. గౌరి కళ్ళలోకి చూసింది. "మా అమ్మది!" అని పైకి అనేసింది గౌరి.

"ఏమిటే, ఆ దొంగచూపులే వద్దంటా" అంటూ ఒక్క విసురునవచ్చి గౌరి వీపుచరిచింది. గౌరికంఠము కీచుమంటూ అరచి సొమ్మసిల్లింది. మరో రెండురోజులు జ్వరంతో మంచ మెక్కింది. ఏదో వీభూతిపెట్టి అత్తగారు మంచం పక్కనే కూర్చుని, అందరితోటి ధాటిగా మాట్టాడం వింటుంటే గౌరి తలనొప్పి ఎక్కువైనా భరించి పక్కకి తిరిగి కళ్ళనీళ్ళు పెట్టుకునేది.

మరో మధ్యాహ్నం "ఏమే కోడల్ని తీసుకొచ్చావుట చూపెట్టనేలేదే" అంటూ మాసిపోయిన పంచి వట్టిచుట్టూ తిప్పుకుంటూ నల్లటి ముసలమ్మగారు మండువాలోకి వచ్చింది.

ఆ ఇంట్లో ఆరోజే పథ్యంకతికిన గౌరికి ముసలమ్మ వెళ్ళిన దగ్గరనుండి వాంతులుపట్టుకు మళ్ళీ పడకేసింది.

ఆ ముసలావిడకి పెట్టాల్సిన శాపనార్థాలు పూర్తిచేసి, గౌరి పుట్టింటివాళ్ళని దండకంలోకి చేర్చింది. చివరికి గౌరి వట్టి రోగిష్టిది కనుక పుట్టింటికి పంపెయ్యమని కొడుకుని దగ్గర పెట్టుకు పెద్దపెట్టుని శోకం మొదలెట్టింది. సీతమ్మగారు మనిషి అర్భకమైనా కంఠము గట్టిగానే వుంది. మళ్ళీ ఏం వచ్చింది? నాకు తెలీకడుగుతా? శుభమా అంటూ కోడల్ని తీసుకొచ్చి ఈగోలేమిటంట? అయినా మమ్మల్ని బతకనిచ్చేట్టులేవు? ఆ పిల్లేమో హడలెత్తి మంచంపట్టింది. నీ సంగతి తెలిస్తే పిల్లనిచ్చేవాళ్లేనా? పాపం తెలీక ఈ రొంపిలో పడవేశారు! అంటూ దవడలు నొక్కుకుంది.

అను, అను నిన్ను తీసుకొచ్చి నా ఇల్లు నా సర్వస్వం ఇవ్వబట్టేగా ఇల్లా గడేగారులా తయారయ్యావు. లేకపోతే ఏవుందే? తిండికే గతిలేదు నీవాళ్ళకి. ఈనాడు అంతా పెద్దలే అయ్యారు నాకు నీతులు చెప్పేందుకు అని పూర్తిచేయ చేయకుండానే సీతమ్మగారు అందుకుంది. ఇష్టంవచ్చినట్లు మాట్లాడకమ్మోవు. ఆనాడు కాళ్ళావేళ్ళా పడంచూసిన పెద్దలింకా బతికేవున్నారు. వూరికే నోరు పారేసుకుంటే నేను ఏమీవూరుకునే ఘటాన్ని కాదు అనడంతో అత్తగారి నోరు మూతపడింది.

ఆరోజు దీపాలవేళదాక మనుష్యులు తిరిగినా కంఠాలు నిద్దరోయినట్టే వున్నాయి. సందెవేళ ఓ ఇద్దరు సాధుఅమ్మలు దిగడ్డారు. వాళ్ళని పెరటివేపు బోడిగోడల పక్కనవున్న సిమ్మెంటుదిమ్మలమీద కూర్చోపెట్టి మర్యాదచేసి అమ్మడూ సీతోయి, దాహానికి పట్టుకురావే అంటూ కంఠాన్ని మార్చి పిలవటంతో గౌరి కర్థంకాక సీతమ్మగారికేసి చూసింది.

రెండు తవ్వగ్లాసుల్లోకి మజ్జిగవంచి పట్టుకెడుతూ అంతేలే అన్నట్లు పెదిమ విరచింది.

దాన్ని గౌరిని : పిలు అని సాంబానికి పురమాయించింది. సాంబము మనస్సు

ఎల్లాంటిదో కనుక్కోవడం కష్టమే, వంటిరంగు బూజుపట్టినలాంటి నలుపు. జుట్టు బిరుసుగా తిరిగిన చిన్న వొంకులు. చాలాభాగం తెల్లగా మెరుస్తుంది. ముక్కు సగంలో ఆగిపోయినట్టు వుంటుంది. పెదిమలు నల్లగా బలంగా కనబడతాయి. పళ్ళు చుట్టపొగకి రంగు మార్చుకున్నట్లు చీకట్లో మెరవడం మానేశాయి. ఆకారం ఎత్తుకి తగిన శరీరం పెరిగింది. గుండ్రటికళ్ళల్లో ఎర్రజీరలు ఎక్కువ కనపడటం చూస్తే కొత్తవాళ్ళు మాట్లాడేందుకుసాహసించరు. కంఠంలో జీర, వినేందుకు శ్రావ్యంగావుండదు. నిన్నే, అమ్మపిలుస్తుంటే వినపడలా? అనటం గౌరి విని వులిక్కిపడింది.

మెల్లగా సాధమ్మల ఎదుటికి వెళ్ళింది అత్తగారు దణ్ణం పెట్టమని కళ్ళతో సైగచెయ్యటం చూసి వంగింది గౌరి.

వాళ్ళ దీవెనలు పూర్తిచేసి గౌరిని దీపంతోపోల్చి మెచ్చుకున్నారు.

అత్తగారు లోపలికి వెళ్ళాలి అనేదాకా గోడ మొదట్లోనే నిలబడటంవల్ల గౌరికాళ్ళు పీక్కువచ్చాయి.

సాధమ్మలు కామారపుజీడిలా కాంతమ్మని విడవకుండా కూడాతీసుకెళ్ళారు.

ఇంట్లో భయంకూడా ఆవిడతోటే వెళ్ళినట్టు వుంది. సీతమ్మ గౌరిని ఎంతో ఆప్యాయంగా చూస్తోంది. మామగారు ఎంతో ప్రేమగా పలుకరించారు. కాని తల్లి మాటని తు.చ. తప్పకుండా కొడుకే పాటిస్తున్నాడు. ఎప్పుడూ రుసరుసలాడుతూ గౌరిని వేధిస్తూ మాఅమ్మమాటే మరచావంటాడు. అల్లాఅని మీఅమ్మ ఎప్పుడు వస్తారంటే, ఆవిడమాట ఎత్తావో వూరుకోనంటూ విరుచుకుపడతాడు. అడక్కపోతే విరగడైందని ఆనందిస్తున్నావా? అని అస్తమానం ఆ ధోరణి వినలేక పెరట్లోకి పారిపోయేది.

ఓవారం తిరక్కుండానే సీతమ్మగారి తమ్ముడు ఓ అందమైన కుర్రాణ్ణి వెంటబెట్టుకు వచ్చాడు. మొదటిలో గౌరి సిగ్గుపడి తప్పించుకు తిరిగినా ఆవిడ తమ్ముడు గిరి వూరుకోలేదు. ఎప్పుడూ నవ్వుతాడు. ఎన్నోమాటలు చెబుతాడు. పుస్తకాలు చదువుతాడు. బొమ్మేస్తా కూర్చోమంటూ వెంట పడతాడు.

లేకపోతే కథలు చెపుతాడు. చంటి సీతమ్మగారి కొడుకట. సీతమ్మగారు వాళ్ళ అక్కట. పున్నయ్యగారు నిజంగా రామచంద్రుడంత మంచివాడుట. కాని ఆయనకి మొదట తాటక్కి అనగా, మీ అత్తగారైన కాంతమ్మగార్కి వివాహం జరిగిందట. కాని ఓ సన్యాసి పుంగవుడు పుణ్యనూ అని వుపదేశాలుచేసి విరక్తి పుట్టిస్తానని దేశంమీదకి తీసుకువెళ్ళి మారీ చుడిలా మాయమయ్యాట్ట. పున్నయ్యగారి తల్లి ఈ సాంబడుగార్ని అనగా మీ భర్తగార్ని దాచేసి కాంతమ్మగార్ని శంకరగిరిమాన్యాలు పట్టించిందట. మా అక్కయ్యని ఇచ్చి పున్నయ్యగార్కి మళ్లీ పెళ్ళిచేస్తే మాసాంబిగాడు సుఖపడతాడని మా అమ్మదగ్గర మొసలికళ్ళు చెమర్చిందిట. బంధువులు కొందరు సుఖంపలికి పట్టుపట్టడంతో అక్కయ్యశాపగ్రస్తగా ఈ ఇంటికివచ్చిందట. అక్కయ్యని భయపెట్టి తాటకి మళ్ళా గృహప్రవేశం చేసిందట. ముసలావిడ వేగలేక మఠంలో చేరి పోయిందట. ఆవిడకి పేరురావటం ఇష్టంలేక మరోమఠం కాంతమ్మగారు స్థాపించి తనే వోగంట ముక్కుమూసుక్కూర్చుని చీకటిపడగానే యింటిముఖంపట్టి తెల్లవార్లు పున్నయ్యగార్ని దీవించి అనగా పరిభాషలో తిట్లు అన్నమాట. ఇవ్విధముగా కాలము గడుపుచున్న సమయంలో మీ తాతగారైన రామేశంగారు ఆవిడ ఏకాగ్రతకి మెచ్చుకొని తమ కుమారుడి పుత్రికైన మిమ్మల్ని ఇచ్చి, గుట్టుచప్పుడుకాకుండా వెంకటేశ్వరుడి సాక్ష్యంతో వివాహం జరిపించిరట. అస్సమయంబున మీ అమ్మగారు ఆటంకంబు తెల్పగా ఏషరతునైనా వివాహం ఆపిన యెడల కొండపైనుండి దుమికి అశువులు విడిచెదమని శపథం చేసినట్లుకూడా విన్నవించిరట.

కథాగమనంబు ఇప్పటికి సమాప్తంబయ్యెనంటూ తెల్లటిపళ్లు మెరిసేలా నవ్వాడు గిరి.

గౌరికి అప్పుడు అర్థమైంది అమ్మఎందుకేడ్చేదో. ఇంక ఊహించేందుకు వీల్లేకుండా, గౌరిని రెక్కపుచ్చుకు లాక్కెళ్ళాడు. చూడు ఈసారి ఆ గిరిగాడితో సరసాలాడావో చీరి ఎండేస్తా తెలిసొందా? అంటూ ఎర్రటిగుడ్లు వురిమిచూశాడు గౌరికేసి సాంబం.

ఎందుకో గౌరికి ఎప్పుడూ గిరితో మాట్లాడాలన్న కోరిక ఆకాశంలా పెరుగుతోంది. చీకటిపడుతుందంటే భయం ఆ గదిలో తన భర్తని చూస్తూ రాత్రిఅంతా గడపాలి.

గిరి ఇచ్చిన పుస్తకం గౌరి తెరుస్తుంది. అందులో ఎంతో మంచివాసన మనస్సుకి మల్లెపూలపందిరి కింద వున్నంత హాయిగా వుంటుంది, కోపంతో లాక్కుంటాడు. ఏమివుంది వెధవ పుస్తకంలో అంటూ విసిరేస్తాడు. ఇది చదవరాదూ అంటూ తల్లి పేరుతో వున్న సాధమ్మమీది పాటలుపాడి వినిపిస్తాడు. చెవులు మూసుకోవాలనిపిస్తుంది. వింటున్నావా, పోనీ ఇది విను అంటూ మరో సాధమ్మ పుస్తకం తెరుస్తాడు. తనుకునుకుతుంది; తిట్టుకుంటాడు. వుడుక్కుని గౌరిని గిల్లి ఏడిపించి కసిగా నిద్రపోతాడు. ఈమధ్య చాలారాత్రులు అల్లాగే తిరుగుతున్నాయి. కాని గౌరికి తెల్లారి నూతి చపటామీద కూర్చునున్న గిరిని చూడగానే రాత్రి జరిగిన పీడకల కరిగి సూర్య కిరణాలో యింకిన మంచుబొట్టులా మనస్సు నిర్మలంగా మిగిలేది సీతమ్మగారికి తమ్ముడంటే ప్రాణం. గిరితోకలసి నవ్వటం ఎంతో బాగుండేది. గిరికి ఇంట్లో వుండబుద్ధికాదు. ఎప్పుడూ దూడలశాల ముందువున్న బాదంచెట్టుకిందే కూర్చుంటాడు. ఆరోజు చంటిచేత లెక్కలుచేయిస్తూ బాదంచెట్టుచుట్టూ దిమ్మలా మట్టిపోస్తున్నాడు గిరి.

పెరటిలోకి వెళ్లిన గౌరి యింటిపని మర్చిపోయి, గిరికి సాయంచేస్తూ పెరటిలోనే పొద్దెక్కేదాకా వుంది.

పొలంనించి తిరిగివచ్చిన సాంబానికి గౌరి యింటిలో కనబడకపోతే, కోపం వెర్రితల వేసింది. సీతమ్మపైన విరుచుకుపడ్డాడు. సమాధానంరాక పెరటిలోకి వెళ్ళాడు.

కొత్తగాపోసుకున్న మట్టిదిమ్మని చూచుకుంటు ఇద్దరూ చెరోపక్కా కూర్చొని వున్నారు. ఎదురుగా చంటి పాఠాలు గట్టిగా చదువుతూ మధ్య మధ్య గోళీలుతీసి విసురుతున్నాడు.

విసిరిన గోళీ సాంబానికి తగిలింది. గౌరి గిరికేసి చూసి నవ్వుతోంది. గిరి ఇంకొక కథ చెబుతా వినమంటున్నాడు. సాంబానికి కోపంతో మాటలు రాక గౌరిని జడపట్టుకు గుంజాడు. విడిపించుకుంటూ చెట్టుపైకి తూలింది. గిరి సాంబానికేసి కసిగా చూశాడు. సాంబము మొహంతిప్పుకు గౌరి జబ్బపట్టుకు లోపలికి లాక్కుపోయాడు. మట్టితవ్విన గునపాన్ని దూరంగా విసిరి గిరికూడా వెనకే వెళ్ళాడు.

వాడికి ఇష్టంలేనప్పుడు అమ్మాయితో ఎందుకురా మాట్లాడ్డం అన్న అక్కగారి అభిప్రాయంతో కూడిన మందలింపుకి, గిరి తేరుకుని నేనేం రమ్మని పిల్చానా ఏమిటి ఏదో? సరదాగా కబుర్లు చెబుతూంటే నేనూ మాట్లాడా. పాపం అమ్మాయికి యింకా అభంశుభం తెలిసినట్లులేదు. వీడిలో ఇంత పౌరుషం వున్నట్టు ఇదివరకు చూడలేదే అంటూ, సాంబాన్ని వెక్కిరించాడు.

గది తలుపుల సందులోంచి చూస్తున్న చంటి "వదిన్ని కొట్టేస్తున్నాడు" అంటూ వుద్రేకంతో తల్లి దగ్గరికి పరిగెత్తాడు. గిరి లోపలికి దిగి సాంబంచేతిలో కర్ర లాక్కున్నాడు.

గౌరి తలకి తగిలిన దెబ్బకే స్పృహతప్పి పడివుంది.

ఈసారి సీతమ్మ సాంబాన్ని గట్టిగా చివాట్లు పెట్టింది. ఇష్టంలేకపోతే నువ్వూ మీఆవిడ వేరేవుండమని బెదిరించింది. మీ నాన్న రానీ తేలుస్తానంది. ఏదో చిన్నతనం, మాట్లాడితే కొడతావా! అంటూ నిలేసింది.

-కథలు చెప్పే గౌరి

సాంబానికి పట్టిన పిచ్చికోపం విడిచిపెట్టింది. గౌరిమీద జాలేసింది. కాని ఈ గిరిగాడు పోతే బాగుండుననిపించింది.

సీతమ్మ గౌరిని పెరట్లోకి పిల్చుకెళ్ళింది. గిరి గౌరితలకి కట్టుకట్టాడు.

గౌరి కృతజ్ఞత కళ్ళనీళ్ళతో చెప్పుకుంది. గిరి మనస్సు జాలితోనిండి మృదువుగా గౌరి తలనిమిరాడు. భాషలేదు, భావాలు ఎన్నో మనస్సులు తెలుసుకున్నట్లు గౌరి మూలిగింది. గిరి నిట్టూర్చాడు. తలగాయం మానేదాక సీతమ్మ గౌరిని పక్కనే పడుకోపెట్టుకుంటోంది. సాంబానికి ఏం చెయ్యటానికి పాలుపోవటంలేదు. 'గౌరిని తనక్కాకుండా మనస్సు విరిస్తే' అమ్మో అని భయపడ్డాడు. తల్లివస్తే బాగుండును అనుకున్నాడు.

పగటిపూట సీతమ్మ పురాణం వినేందుకు ఎప్పుడైనా వెడుతుంది.

సాంబం తల్లికి కబురుపెట్టాలన్న వూహతో గాజుల బత్తుడు ఇంటికి వెళ్ళాడు.

చంటి పెరటిలో గోళీలాడుతున్నాడు.

గౌరి పడుకుని ఇంటిచూరుకేసి చూస్తోంది. గిరి ఎప్పుడొచ్చాడో గడపలో నిల్చున్నాడు. గౌరి చాలాసేపటికి అటు చూసింది. లేచి కూర్చునే ప్రయత్నం చెయ్యబోయింది. వద్దంటూ వంగి పడుకోబెట్టి మంచంపట్టీమీద కూర్చున్నాడు గిరి. ఏదో మాట్లాడాలనుకున్న గౌరికి సిగ్గుతో మాటలు పైకిరాలేదు.

గిరి నేలకేసిచూస్తూ "రేపు వెళ్ళిపోతున్నా. నా మూలానే నీకీ కష్టం వచ్చింది"- అంటూ బాధపడ్డాడు. "నీతో మాట్టాడుతుంటే యిట్టే గడిచిపోయాయి రోజులు", అంటూ ఇంకా చెప్పబోయాడు. కాని గౌరి పసిపిల్లలా గిరి దగ్గరగా జరిగి ఏడ్చి, నువ్వు వెళ్ళొద్దు అంటూ మారాముచేస్తూ గిరి చేతులతో తన కళ్ళు మూసుకుంది.

పున్నయ్యగిరి కంఠము విని గిరి పెరటిలోకి తప్పుకున్నాడు.

ఆరాత్రి తన ప్రయాణంమాట అప్పగారికి చెప్పాడు. సీతమ్మగారు అప్పుడే వెడతావురా! అంటూ వుసూరుమంది. గిరి దిగులుగా, వెళ్ళొద్దా? అంటూ పెట్టె సర్దుతున్నాడు. చాలా పొద్దుపోయిందాక సీతమ్మగారు తమ్ముడిదగ్గరే గడిపింది. గౌరికి కంటిమీద కునుకురాలేదు. గిరి ఇంకో నాలుగురోజులు వుంటే బాగుండును. ఎలా చెప్పటం? సీతమ్మగారు రావటం, నడుం వాల్చటం, మళ్లా లేచివెళ్ళటం అంతా చూస్తూనేవుంది గౌరి. అప్పగారికోసం వచ్చిన గిరికి గౌరి వంటరిగా కనబడింది. నిద్దరలేవటం ఇష్టంలేదు. గౌరి మొహం దగ్గరగా వంగి చూశాడు. జుట్టు వేళ్ళతో సవరించాడు. కళ్లు మెరుస్తున్నాయి. దొంగా మెలుకువగానే వున్నావే! మెల్లిగా నవ్వాడు. గౌరి చేతిని విడిపించుకు వెచ్చటి కన్నీళ్లని తుడుస్తూండగానే వెల్తురు వచ్చింది. కళ్ళు తెరచి ఆవలించినట్లు గుమ్మంలోకి వచ్చింది.

గౌరి బద్ధకంగాలేచి బాదంచెట్టు మొదట్లో కూర్చుంది. తెల్లబట్టలు, పంచి, లాల్చీ, వుంగరాలజుట్టులో పాపిట కనపడలేదు. పమిటలా వొపక్కే వేలాడుతోంది కండువా. నల్ల చెప్పుల్లోంచి తెల్లటి పల్చటి వేళ్ళు మెరుస్తున్నాయి. చేతిలో తోలుసంచీ సగం తెరచుకుంటూ బాదంచెట్టు దగ్గరకు వచ్చాడు గిరి. కళ్ళజోడు తుడుచుకుంటూ గౌరితో వెళ్ళమంటావా; అన్నాడు. నేనుండమంటే ఎవరుంటారు. గౌరి కళ్ళల్లో కోపంతో కలసిన విచారం కనపడింది.

గిరి గలగలా నవ్వాడు. దొడ్డిఅంతా పువ్వులు విడిచినంత బాగుంది అని గౌరి అన్నది.

అబ్బో కవిత్వంవస్తుందే అమ్మాయిగార్కి, పోనీ కథలు వ్రాయకూడదూ అంటూ గౌరి తలపైన చిన్నగా తాకాడు. దూడలపాకకేసి చూస్తూ ఇంక ఈ ఇంటిలో మనుషుల వునికి వుండదు. అక్కడ అది. ఇంటిలో మేము ఒక టేనంటూ వచ్చిన దుఃఖాన్ని ఆపుకుంటు మొహం

తిప్పుకుంది గౌరి. ఆశ్చర్యంగా గౌరికేసి చూశాడు, గౌరి చిన్న బుఱ్ఱకికూడా వూహలు న్నాయా అన్నట్టు. ఈసారి నవ్వులో ఉత్సాహంలేదు. దిగులుగా పల్చగా ఉంది. చంటి బస్సు వస్తోందన్న పిలుపుతో గౌరికేసిచూసి వెళ్ళిపోయాడు గిరి.

ఆ రోజు లేచేసరికి గిరి వెళ్లాడని తెలిసి సాంబంమనస్సు తేలికైంది. వళ్ళు సంతోషంతో దూదిలా తేలిగ్గావున్నట్టు వుంది. ఇంత తొందరగా వెడతాడని తెలిస్తే తల్లికి కబురెట్టే వాడినేకాదు. అనుకున్నాడు. కేకలతోటి కాంతమ్మ గడప దాటింది. కాంతమ్మ ఇల్లంతా తిరిగింది. సాంబాన్ని దగ్గరకు తీసుకుంది. గౌరి తల కేమిటి అన్న ప్రశ్న సీతమ్మ నడిగింది.

నీ కుమారుడి ప్రజ్ఞ అని ఈసడించటంతో తారా జువ్వలా లేచింది. ఏడీ గిరీశంగాడు అని హుంకరించింది. గాజులబత్తుడు చెప్పాడులే అని సీతమ్మ ఆశ్చర్యానికి బదులు చెప్పింది. గౌరిని పుట్టింటికి పంపేస్తానని బెదిరించింది. ఈమాటవిని సాంబం మనస్సులోనే తిట్టుకున్నాడు తన తెలివిని.

అనుకోకుండా గౌరితండ్రి చూసిపోదామని ఆ రోజే వచ్చాడు. కాంతమ్మ వాకిట్లోనే అనాల్సినవన్నీ ఏకరువు పెట్టింది. సూర్యనారాయణగార్కి కోపంవచ్చి పిల్లని తీసుకుపోతా ననగానే వెంటనే వెళ్ళండి అని సమాధానమిచ్చింది.

గౌరికూడా ఆరోజే ఆ యింటిలోంచి బైటకి వెడుతోందని విని సాంబం మనస్సు విలవిలలాడింది. తన పొరపాటు తల్లికి చెప్పలేదు. గౌరికి ఎల్లాచెప్పాలన్నా వంటరిగా కనపడలేదు. ఐనా వెళ్ళేటప్పుడు చెప్పేందుకు వస్తుంది అన్న ఆశతో గదిలోనే ఉన్నాడు.

గౌరి వచ్చేవేళకి కాంతమ్మ గదిలోకి దిగడింది. పెట్టె పట్టుకెళ్ళవద్దని కోడల్ని ఆజ్ఞాపించింది.

పున్నయ్యగారు పెట్టె బైటకుతీయించి కోడల్ని సాగనంపారు. సాంబాన్ని గౌరికేసి చూడకుండా మధ్యగా కాంతమ్మ నిల్చుంది.

ఈసారి యింటికిరాగానే అంతా ఎన్నో ప్రశ్నలు వేశారు. అమ్మ నాన్నని కోప్పడింది. మంచీచెడ్డాలేకుండా తీసుకురావడమేమిటి? ఇంకా రెండోనెల పూర్తికాలేదల్లే వుంది. అల్లా అంటూ పక్కింటి బామ్మగారి మాట వినగానే గౌరికి సిగ్గుతో వళ్ళు బిగుసుకుంది. తను అల్లా చెప్పలేదే వాళ్ళెలా కనుక్కున్నారు? ఏమో అనుకుంది.

ఇంట్లో అంతా ఎంతో ముద్దుగా చూస్తున్నారు. రోజులు తిరుగుతున్నాయి. అస్తమానం గిరిమాటలే గుర్తుకి వస్తున్నాయి. డాక్టరుగారి యింటిదగ్గరనుంచి అన్ని పత్రికలు తెప్పించి చదువుతోంది. అమ్మ భాగవతం చదవమంటుంది. బామ్మ హరివంశము చదవమని యిచ్చింది. నాన్న దగ్గర ఎప్పుడు తెల్లకాయితాలు దస్త్రాల్లా వుంటాయి. గిరి చెప్పినట్లు కథరాస్తే బాగుండును. ఏం వ్రాయాలో తెలీదు. రోజూ ఓ కాయితంనిండా చుక్క లెట్టికలిపిచింపటంతో నెల్లాళ్ళూతిరిగాయి.

ఓసారి డాక్టరుగారి అమ్మాయి కబుర్లల్లో తనకి తెల్సిన అమ్మాయికి బహుమతి వచ్చిందని, వ్యాసాలు బాగావ్రాస్తుందని గొప్పగా చెప్పుకుంది.

ఆరోజు మళ్ళీ కథకోసం కాయితాలకట్ట పెట్టుకుంది. గిరిలాంటి మనిషిని వ్రాసింది. మళ్ళీ సిగ్గేసి చింపేసింది. ఆ సాయంత్రం, సాంబంగారు వచ్చారు అంటూ అప్పి హడావిడి పడుతోంది. ఏది జరిగినా, ఎవరు వచ్చినా ముందు అప్పిదే హడావిడి అని అంతా నవ్వుకున్నారు.

వచ్చినకాస్సేపటికి అప్పిప్రశ్నలు అయ్యాక గౌరిని పిలవమన్నాడు. గౌరి చాలాసేపు మొహం చూపటానికి ఇష్టపడకపోయినా బాగుండదు వెళ్ళమన్న పక్కింటి బామ్మగారి మాటకి కట్టుబడింది.

సాంబం గౌరినిచూసి మురిశాడు. గుక్కతిప్పుకోకుండా గిరిని తిట్టాడు. వాడిమూలాన్నే

నిన్ను అంటూ తల నిమిరాడు, సిగ్గుపడ్డాడు. భర్త లోమార్పుకి గౌరి గర్వపడింది. కాని గిరిని తిట్టినప్పుడు మనస్సు చిన్నబోయింది. తల్లి ఇచ్చిన గడువు దాకా సాంబం బస్తాలా తింటూ కాలం గడిపాడు. గౌరిని పంపమని మాటకైతే అన్నాడు. బామ్మగారు ఇప్పుడెందుకులే నాయనా అనటంతో వంటరిగా వెళ్ళిపోయాడు.

ఈసారి మళ్ళీ కథ మొదలుపెట్టింది. సాంబం, గిరి ఇద్దరూ వున్నారు. ఇద్దరిదీ ఒకతరహాకాదు. ఇద్దర్నీ అన్నదమ్ములుగా సృష్టించింది. గిరికి మనస్సువుంది. ధైర్యంలేదు. సాంబానికి ధైర్యంవుంది, మనస్సులేదు. పెద్దకథే అనుకుంది. ధైర్యం లేక తమ్ముడు ఇల్లువిడిచి వెళ్ళినట్టు పూర్తి చేసింది. పరిసరాల్ని వర్ణించింది. సాంబాన్ని ప్రకృతిచేత తిట్టించింది. రాళ్ళు కరగవంటూ పూర్తిచేసింది. మళ్ళీ చదవకూడదు చదివితే నచ్చకపోవచ్చు అన్న వూహరాగానే తండ్రికి ఇచ్చి భయపడుతూ పంపమంది. కథా నీ మొహం : అంటూ సంతృప్తిగా నవ్వటంచూసి గౌరికి ధైర్యంవచ్చి పోటీకే పంపమంది - అసలు వూరికే పంపాలనుకున్నావు మళ్ళీ ఇదేం పిచ్చి అని, మనస్సు చివాట్లు పెట్టింది.

ఓవారం కథనిగురించి కలలుకన్నా మళ్లీ మర్చిపోయింది. చుట్టాలు రావటం ఏదో యివ్వటం అమ్మ మురవటం తనకేం నచ్చకపోయినా జరుగుతూనే ఉన్నాయి. ఈసారి పున్నయ్యగారు వచ్చారు అంటూ నాన్న సంబరపడుతూ వచ్చి చెప్పారు. ఇంటిల్లి పాది ఆయనకు మడుగులు వత్తారు, అన్నంత యిదిగా చూస్తున్నారు.

అమ్మచేతికి డబ్బుయిచ్చి అమ్మాయికి కావల్సినవి కొనమని చెప్పారుట. మళ్లీ వాళ్ళ అత్తగారితో ఈవిషయం తేవద్దు అని సీత చెప్పమంది అనికూడా అన్నారట. తెల్లారి వెళ్ళి పోయేముందు సీతమ్మగార్కి, పున్నయ్యగార్కి బట్టలు యిచ్చారా? అంటూ బామ్మచెప్పి ఇప్పించింది.

దీపావళి దగ్గరపడకుండానే ఇంటిచుట్టూ తాటాకుటపాకాయలు, వుల్లి పాయలు పిల్లలకి దొరికిపోయాయి. ఒకటే చప్పట్లు. గౌరిగదివిడిచి బయటికి రావటంలేదు. పిరికిది అంటూ బామ్మ పెదిమ విరిచేది.

ఆరోజు బామ్మ తొందరగా తలకిపోసింది. టైముచూసి నాన్న కోప్పడాడు. మూడుఅన్నా కాకుండా దాన్ని లేపారు ఎందుకంటూ. మీకు తెలవదులెండి అని అమ్మ కోప్పడ్డం గౌరికి సిగ్గేసింది. స్నానం పూర్తి కాకుండానే గట్టిగా అరవలేక మూలుగుతోంది గౌరి. అమ్మడూ నరకాసురుడో, కిష్టమ్మో మరిపుట్టాడు అంటూ కేకపెట్టడం విన్నాక గౌరికి మనస్సులో వూహలు తిరిగాయి. కాని నీరసంతో అవయవాల కదలికే సొమ్మసిల్లి నట్టు పడివుంది. కాసిని కాఫీనీళ్ళయినా పట్టుకురండి అని పక్కింటి బామ్మగారి హడావిడికి మళ్లీ కళ్ళు తెరచింది గౌరి.

ఇల్లంతా పండక్కి సందడిగా ఉంది. పిల్లల్ని చప్పుళ్ళు చెయ్యొద్దు అంటూ అంతా అదిలిస్తున్నారు. పిల్లాడు జాగ్రత్త జడుచుకుంటాడంటూ నాన్న గంటకోసారి చెప్పివెడుతున్నాడు. మరో రెండురోజులకి నాన్నకి సంతోషంపట్టలేనట్టు మాట రావటంలేదు. మన గౌరికే అంటూ పుస్తకం అమ్మచేతిలో పెట్టాడు. అమ్మ నన్నూ, పుస్తకాన్ని తృప్తిగా చూసుకుంది.

ఏమిటే అన్న బామ్మకి, ఏంలేదు. దాని కథకి బహుమానం వచ్చిందట. చివరవరకూ నిర్ధారణ కాలేదేమో, కనకే ముందు తెలుపలేదు. అని బామ్మ వ్యాఖ్యానం చేసింది. పచ్చెంతినేదాకా చదవకూడదంటూ పుస్తకం దాచేశారు.

ఆరోజు తనపేరు చూచుకోగానే ఏదో మార్పు ప్రవేశించింది. ఏమిటో తనకి తెలవదు. మిగిలిన పేర్లు చదివింది ముందు ఏమీ తోచలేదు. తరవాత ఏ గిరి అన్న ప్రశ్నఎదురై మళ్ళి చదివింది తన పేరుపక్కన గిరి పేరుచూసి, సంతోషం, భయంకలిసి భయపెట్టాయి.

అత్తగారేం గొడవచేస్తుందో! కొడుక్కి ఏం చెప్పి వెడుతుందో అన్న అందోళనతో మనస్సు పాడై సాయంత్రానికి మళ్ళా వెచ్చపడింది.

అంతా ఖంగారు పడ్డారు.

బామ్మ అమ్మని కోప్పడింది. అందరికీ గొప్పగా చెప్పుకు తిరిగావు : పిల్లకి దిష్టే అంటూ హడావిడిచేసింది. తెల్లవారి స్నానం అనగా జ్వరం జారింది పిల్లకి. తేలిగ్గా చేయించే యండి స్నానం అంటూ డాక్టరుగారి ఇంటివాళ్ళు సలహా యిచ్చారు.

దీపంవెల్తుర్ని చూడలేక కళ్ళు చిట్లిస్తున్న పసివాడిలో గిరి మొహం కదిలింది. గౌరి అనుమానాలకి అంతు లేదు. తెల్లవారింది. ఇరుగూ పొరుగూ రాకుండానే స్నానం పూర్తి చేయించు అంటూ అమ్మని తొందరపెట్టారు పక్కింటి బామ్మగారు.

పక్క నాన్నగారి గదిలోకి మార్చారు. సాంబ్రాణి పొగ చుట్టుకుంది. మామిడాకులు, మరచెంబులు అంటూ సుబ్బయ్యగారు బొంగురుకంఠంతో అడుగుతున్నారు.

మీ అత్తగారు వచ్చిందేవు అంటూ నాన్న కేక పెట్టాడు. అమ్మ ఎదురువెళ్ళేలేదు. బామ్మే పిల్చుకొచ్చింది. తడిచేతులు కొంగుకి తుడుచుకుని చంటాడిని వళ్ళోకి తీసుకుంది. ఇదివరకటి గంభీరంలేదు. కంఠం నీర్సపడింది. చూపులో కూడా ఉగ్రం తగ్గింది. గౌరిని క్షేమం అడిగింది. మనమణ్ణి ముద్దులాడింది. మరి వెడతానని లేచింది. అదేమిటందోయి అంటూ అంతా ఆశ్చర్యపడ్డారు. మావాడికి నాతో రావటానికి నామర్దాట. అంటూ కళ్ళు వత్తుకుంది. ఏదో జరిగింది - ఏమిటో తెలియకుండానే వోదార్చారు. వాళ్లు వస్తారని తెల్పి ప్రయత్నాల్లో పడ్డారు. ఏంపేరు పెడతారేమిటి!

అంతా తలోటి మెబుతున్నారు. ఐనా వాళ్ల యిష్టం అంటూనే చెపుతున్నారు. అత్తగారు చంటాడిని పడుకోబెడుతూ కథలురాసే గౌరికి మనం చెప్పాలా? పేరు, అంటూ కొంచము కోపము తొంగిచూసినా, సంతోషమే కనబడింది గౌరికి. గిరిమాట ఎత్తనందుకు మనస్సు తేరుకుంది. గిరి యేమనుకున్నాడో ఎవరు చెపుతారు ! సమాధానంరాలేదు. గిరి పంపిన పేకెట్లు పుచ్చుకు సీతమ్మగారు, పున్నయ్యగారు పిల్లాడి తండ్రిని తీసుకువచ్చారు.

కథలునేర్పే గౌరి అని పైన వ్రాసివుంది. అందులో ఏదో కొత్తఅర్థం తొంగి చూసింది. దీవెనలతో వున్న కార్డుని చంటాడి తలగడకింద దాచింది గౌరి.